ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సిద్దిపేట 3
శుక్రవారం 12 సెప్టెంబరు 2025

ప్రియుడిపై మోజుతో
భర్తపై హత్యాయత్నం 4

పిల్లలు పుట్టలేదని
భర్తకు వీడియో కాల్ చేసి..
● వివాహిత బలవన్మరణం 4

జాప్యం..
అందుకేనా!
● మద్దూరులో భూ భారతి రిజిస్ట్రేషన్లలో నిర్లక్ష్యం
● కాలయాపన చేస్తున్న అధికారులు
● డబ్బుల కోసమేనని అన్నదాతల ఆరోపణ 6

కంటిచూపు కోల్పోయిన విద్యార్థికి చికిత్స కోసం

రూ.10లక్షలు అందజేసిన జగ్గారెడ్డి దంపతులు

చికిత్స విజయవంతమై కంటిచూపు రావాలని ఆకాంక్షించిన జగ్గారెడ్డి దంపతులు

ఇలాంటి పేషెంట్ల గురించి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి వైద్య సహాయం అందేలా చూస్తానన్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కంటి చూపు కోల్పోయిన ఓ విద్యార్థికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేయూత అందించారు. వైద్య చికిత్స కోసం రూ.10లక్షలు ఆర్థిక సహాయం చేసి ఆసరాగా నిలిచారు. కర్ణాటకకు చెందిన కిషన్‌పవార్, శాంతాబాయి దంపతులు పదిహేనేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లా కందికి వచ్చి స్థిరపడ్డారు. వీరి చిన్న కుమారుడు, డిగ్రీ చదువుతున్న సంపూరన్ నాయక్ ఏడాది క్రితం బైక్ మీద నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయమై కోమాలోకి వెళ్లాడు. ఆ తర్వాత కోలుకున్నా కంటిచూపు పూర్తిగా కోల్పోయాడు. తిరిగి కంటి చూపు రావాలంటే రూ.8 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఆర్థిక స్థోమత లేని బాధితుడి తల్లిదండ్రులు ఏడాది కాలంగా చికిత్స చేయించలేక అవస్థలు పడుతున్నారు. గురువారం వారు జగ్గారెడ్డిని కలిసి తమ ఆవేదనను వినిపించారు. దీంతో సంపూరన్‌కు జగ్గారెడ్డి మనోధైర్యం కల్పించి రూ.10లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ తనవంతు సహాయంగా సంగారెడ్డి నియోజకవర్గంలో క్యాన్సర్ పేషెంట్లను ఆదుకుంటున్నానని చెప్పారు. ప్రభుత్వపరంగానూ సాయమందేలా చూస్తున్నానని తెలిపారు. దాతలు కూడా ముందుకురావాలని పిలుపునిచ్చారు.


కంటిచూపు కోల్పోయిన విద్యార్థి సంపూరన్ నాయక్‌కు రూ.10లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్న జగ్గారెడ్డి

అగ్రిసెట్ ఫలితాల్లో సత్తాచాటిన

తోర్నాల పాలిటెక్నిక్ విద్యార్థిని

● స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన ప్రజ్ఞశ్రీ


ప్రజ్ఞశ్రీ

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అగ్రిసెట్-2025 ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థిని బుచ్చుగోని ప్రజ్ఞశ్రీ రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. సంతోష్ కుమార్ గురువారం తెలిపారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేటకు చెందిన ప్రజ్ఞశ్రీ తోర్నాల వ్యవసాయ కళాశాలలో రెండేళ్ల డిప్లొమా పూర్తి చేసి, వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి మంచి గుర్తింపు తీసుకువచ్చినందుకు అభినందించారు. విద్యార్థినిని కళాశాల ఉపాధ్యాయులు డాక్టర్ ఎన్.ఎ. ఇందూజ, జె.స్పందన, కె.అభిలాష్ రెడ్డి, సిబ్బంది అభినందించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

కొండపాక, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని, నేరస్థులను పట్టుకోవడం సులభతరం అవుతుందని సీపీ అనురాధ అన్నారు. కొండపాక మండలం దుద్దెడలో దాతలు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాలును మానిటర్ చేయడం చాలా ముఖ్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్‌గౌడ్, మహమ్మద్ ఖలీల్, రమేష్, మంచాల శ్రీనివాస్, ఆరేపల్లి శ్రీనివాస్, రమేష్, వనజ, నాగప్రసాద్, శివకుమార్, శ్రీనివాస్, రాజేష్, ఐలయ్య, ఎల్లం, శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీనివాస్, ఆంజనేయును అభినందించి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, త్రీటౌన్ సీఐ, ఎస్ఐ పాల్గొన్నారు.


చేర్యాల పట్టణంలోని గాంధీచౌక్ చౌరస్తాలో నిలిచిన వరద నీరు

మోస్తరు నుంచి భారీ వర్షం

● చెరువులను తలపించిన రహదారులు
● హుస్నాబాద్‌లో దుకాణాల్లోకి చేరిన వరద నీరు
● మరో నాలుగు రోజులు వర్షాలు

సిద్దిపేట/చేర్యాల/హుస్నాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి పలుచోట్ల మోస్తరు వర్షం కురియగా మరికొన్ని చోట్ల భారీ వర్షం కురిసింది. సిద్దిపేటలో రోడ్లు జలమయమయ్యాయి. నారాయణరావుపేట, చిన్నకోడూర్, తొగుట, కొమురవెల్లి, ములుగుతో పాటు పలు చోట్ల వర్షం పడింది. చేర్యాలతోపాటు పలు గ్రామాల్లో సాయంత్రం భారీ వర్షం కురిసింది. చేర్యాలలోని గాంధీచౌక్, కడవేరుగు దారి, అంగడిబజారు చౌరస్తాల్లో వరదనీరు చేరింది. హుస్నాబాద్‌లో రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని హన్మకొండ, సిద్దిపేట ప్రధాన రహదారి, అంబేడ్కర్ చౌరస్తా వరదనీటితో చెరువులను తలపించాయి. రహదారికి ఇరువైపుల ఉన్న దుకాణాల్లోకి వరదనీరు చేరి వ్యాపారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలో గరిష్ఠంగా 15.3 మిమీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. మరో నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.


హుస్నాబాద్‌లో దుకాణాల్లో వెళ్తున్న వరద నీరు


సిద్దిపేటలో రోడ్డుపై నిలిచిన వరద నీరు

మండలం	వర్షపాతం (మి.మీలలో)
నారాయణరావుపేట	15.3
తొగుట	15.3
ములుగు	13.8
ధూలిమిట్ట	11.5
అక్కన్నపేట	11.5
హుస్నాబాద్	9.3
సిద్దిపేట అర్బన్	8.0
చేర్యాల	7.8

గురుకూలాలు భవనాలు

ప్రమాదకరంగా గురుకులాలు, హాస్టళ్లు
ఇటీవలే కూలిన లింగంపల్లి గురుకుల భవనం
ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఇదే పరిస్థితి
పెచ్చులూడుతూ... వర్షాలకు ఉరుస్తూ..


ఆరుబయట స్నానాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

సిద్దిపేట జిల్లాలో గురుకులాలు

ఎస్టీ గురుకులాలు	- 02
బీసీ గురుకులాలు	- 11
ఎస్సీ గురుకులాలు	- 13
మైనార్టీ గురుకులాలు	- 06
ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లు	- 31
బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు	- 28
ఎస్టీ వెల్ఫేర్ హాస్టళ్లు	- 06
మైనార్టీ వెల్ఫేర్ హాస్టళ్లు	- లేవు

సిద్దిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఈ విద్యాసంస్థలపై విమర్శలు తలెత్తుతున్నాయి. మూడు రోజుల క్రితం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల పాఠశాల భవనం కూలిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపింది. ప్రమాద సమయంలో విద్యార్థులు భవనంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. జిల్లాలో పలు గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్ల పరిస్థితి ఇలాగే ఉంది. భవనాలు శిథిలావస్థకు చేరడంతోఎప్పుడు కూలుతాయోననే భయంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ పరిస్థితిపై గురువారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలినలో హాస్టళ్లలో సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని గురుకులాలు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలపై ఎప్పటికప్పుడు అధికారులు దృష్టి పెడుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇటీవల కాలంలో కలెక్టర్లు, ఉన్నతాధికారుల ఫోకస్ పెరిగింది. గురుకులాల్లోనే బస చేసిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ చాలా చోట్ల సమస్యలు వెక్కిరిస్తున్నాయి. అధికార యంత్రాంగం లోపాలను ఎత్తిచూపుతున్నాయి.

సమస్యలతో సహవాసం

● కొడిపల్లి మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్ల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియదు. అందుకే విద్యార్థులు ఆరు బయటనే స్నానాలు చేస్తున్నారు.


చిన్నశంకరంపేటలోని ఎస్సీ బాలుర హాస్టల్ పైకప్పు

ఆంధ్రజ్యోతి విజిట్

● సిద్దిపేట మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఈ భవనానికి కిటికీలకు తలుపులు లేవు. నాలా లేక నీళ్లు బయటకు వెళ్తున్నాయి. 2కి.మీల దూరం నుంచి వచ్చే తాగునీటి పైపులైన్‌తో అనేక సమస్యలు నెలకొన్నాయి.

● రామాయంపేట పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ హాస్టల్లోకి వరద పోటెత్తింది. ఆ సమయంలో 80మంది విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించి మళ్లీ ఇదే హాస్టల్‌లో ఉంచుతున్నారు. పెచ్చులూడుతున్న ఈ భవనం ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయపడుతున్నారు.

● నర్సాపూర్‌లోని గిరిజన గురుకులాన్ని 30ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరు చేశారు. పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరుగుదొడ్లు

మిగతా 5వ పేజీలో

కూల్చితేనే ఉపశమనం

గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల భవనాలు చాలాచోట్ల శిథిలావస్థకు చేరడంతో నిత్యం భయాందోళనతోనే గడపాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు తమకు రాత్రిపూట నిద్ర కూడా పట్టడం లేదని అంటున్నారు. ఈవిషయంపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. లింగంపల్లి ఘటన నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న భవనాలపై అధికార యంత్రాంగంమరోసారి ఆరా తీయాల్సిన అవసరం ఉంది. ఇటీవల రామాయంపేటలోని బాలికల వసతిగృహ భవనం కూడా ముంపునకు గురికావడంతో విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించినా, మళ్లీ అదే భవనంలో ఉంచడం నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది.


హవేళిఘణపూర్ గురుకులంలో నిలిచిన వర్షపు నీరు


కల్హేర్‌లో వసతి గృహ భవనం పైకప్పు నుంచి కారుతున్న వర్షపు నీరు


శిథిలావస్థకు చేరుకున్న కొడిపల్లి బీసీ హాస్టల్ మరుగుదొడ్లు

వర్షం వల్ల క్రీడాపోటీలు వాయిదా


కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో 69వ జిల్లాస్థాయి క్రీడా పోటీలు వాయిదా పడ్డాయి. ఈ నెల 9న ప్రారంభమైన క్రీడా పోటీలు వివిధ విభాగాల్లో క్రీడాకారులు పోటీపడ్డారు. గురువారం అండర్ 14, అండర్ 17 బాలికలు, బాలుర విభాగంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. గురువారం ఒక్కసారిగా వర్షం పడటంతో మ్యాచ్‌లను వాయిదా వేశారు. జిల్లాలో వరుసగా 3 రోజులపాటు వర్షాలు ఉండటంతో మైదానం అనుకూలించని కారణంగా పోటీలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన మ్యాచ్‌లను మరో రోజు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ. సౌందర్య తెలిపారు. వర్షం ప్రభావం దృష్టిలో పెట్టుకుని ఏ రోజు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

గజ్వేల్, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న సోమవారం గజ్వేల్‌లోని ఐవోసీ వెనుక ఉన్న మైదానంలో జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేతి చిన్న సంతోష్, కుంటనోళ్ల శివకుమార్ తెలిపారు. క్రీడాకారులు 16 ఏళ్ల లోపు ఉండాలని, బాల, బాలికలు నవంబరు 31, 2009 తర్వాత జన్మించి ఉండాలన్నారు. 55 కేజీల లోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ రుసుము రూ.100 చెల్లించాలన్నారు. ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకుని హాజరుకావాలన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్‌లో జరిగే 35వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని తెలిపారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

● రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ/హుస్నాబాద్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మహిళా సంఘాలకు అందజేసిన స్టీల్ సామగ్రిని వినియోగించుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం కోహెడ మండలంలో రూ.57లక్షలతో నిర్మించే కాచాపూర్ బ్రిడ్జి, నారాయణపూర్‌లో రూ.91.55 లక్షలతో నిర్మించే హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి శంకుస్థాపనలు చేశారు. సకాలంలో పనులు పూర్తిచేస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సదానందం, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నిర్మల జయరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


హుస్నాబాద్ బస్టాండ్ ఆవరణలో 1932 నాటి నిజాం నవాబు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్‌మోడల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి


మోడల్ బస్సు

హుస్నాబాద్ అభివృద్ధే లక్ష్యం

హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం రాత్రి ఆయన హుస్నాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జంక్షన్ అభివృద్ధిలో భాగంగా 1932 నాటి నిజాం నవాబు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్ మోడల్‌ను ప్రారంభించారు. అంతకు ముందు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో టూరిజం, విద్య, ఇండస్ట్రియల్, వ్యవసాయం, ఉద్యోగ కల్పన, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. టూరిజంలో భాగంగా సర్వాయి పాపన్న కోట, ఎల్లమ్మ గుడి, పొట్లపల్లి ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. బంజరుపల్లి-పందిల్ల పీఆర్ రోడ్డు నిర్మాణానికి, పొట్లపలి-పరివేద పీఆర్ రోడ్డు, హుస్నాబాద్ పట్టణంలో రూ.2కోట్లతో చేపట్టే పల్లె చెరువు అభివృద్ధి, ప్రధాన రహదారిలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించే సెంట్రల్ మీడియం అవెన్యూ ప్లాంటేషన్, సుందరీకరణ, స్వాగత తోరణాలు, జంక్షన్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండోఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, నాయకులు చిత్తారి రవీందర్, చిత్తారి పద్మ పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత : కలెక్టర్

సిద్దిపేట కల్చరల్/కోహెడ సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం వలన ఒకరి ప్రాణాలను కాపాడిన వారమవుతామని కలెక్టర్ హైమావతి అన్నారు. రక్తదానం ఒక సామాజిక బాధ్యతగా అందరూ ముందుకు రావాలని చెప్పారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్తులో ప్రభుత్వ డిగ్రీ, మెడికల్, ఇతర కళాశాలల్లో కూడా నెలకు ఒకసారి రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. అనంతరం కళాశాలలో జువాలజీ ల్యాబ్‌కి వెళ్లి వివిధ రసాయనాల ద్వారా భద్రపరిచిన జంతువులను, కీటకాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, జిల్లా విద్యా, ఆరోగ్యశాఖ అధికారి ధనరాజ్, డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కోహెడలో..

కోహెడ మండలంలో గురువారం కలెక్టర్ హైమావతి గురువారం పర్యటించారు. మండలంలోని తంగళ్లపల్లి శివారులో 23 ఎకరాల్లో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ స్థలం చుట్టూ సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. కోహెడలోని సహకార సంఘంలో సరఫరా చేసే యూరియాను కలెక్టర్ పరిశీలించారు. రోజువారీగా యూరియా వస్తుందని, రైతులు అధైర్య పడొద్దని ఆమె భరోసా కల్పించారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కుకునూరుపల్లికి

చేరిన అంబులెన్స్

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు



కుకునూరుపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): "ఆంధ్రజ్యోతి"లో గురువారం ప్రచురితమైన "గదిలేక నిలిచిన అంబులెన్స్ సేవలు" కథనానికి అధికారులు స్పందించారు. కుకునూరుపల్లిలోని ఆరోగ్యకేంద్రంలో రెండు గదులను అంబులెన్స్ సిబ్బందికి కేటాయించడంతో అంబులెన్స్‌ను గజ్వేల్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించారు. గజ్వేల్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి అంబులెన్స్ సిబ్బందికి ఏర్పాటు చేసిన గదిని పరిశీలించారు. ఇకపై పూర్తిస్థాయిలో అంబులెన్స్ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండనుంది.

డిప్యుటేషన్ రద్దు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన

చిన్నకోడూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయురాలి డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని చిన్నకోడూరు మండలం అనంతసాగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం పాఠశాల గేటు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడారు. పాఠశాలలో గత ఏడాది 56 మంది విద్యార్థులుండగా ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలల నుంచి 41 మంది విద్యార్థులు చేరారని, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 97కు చేరిందన్నారు. పాఠశాలలో ప్రస్తుతం ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారని, ఒక టీచర్‌ను డిప్యుటేషన్‌పై వేరే పాఠశాలకు పంపడం వల్ల ఇక్కడి విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. డిప్యుటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని వారు కోరారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కొమురవెల్లి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన యువకుడు సిలివేరు కరుణాకర్(22) ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



సైబర్ దాడుల ముప్పును సమష్టిగా ఎదుర్కొందాం

» కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు



హైదరాబాద్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): దేశంలో డిజిటల్ విప్లవం కొనసాగుతున్న సమయంలో సైబర్‌దాడుల ముప్పు పెరుగుతుందని, దీన్ని సమష్టిగా ఎదుర్కొందామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. రామంతపూర్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(సీడీటీఐ)లో జరిగిన నేషనల్ పోలీసు హ్యాకథాన్ సైబర్‌కాప్ 2025 అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. సీడీటీఐ త్రైమాసిక పత్రిక హోరిజన్స్‌ను ఆవిష్కరించి, హ్యాకథాన్ విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందచేశారు. సైబర్ సెక్యూరిటీ, సైబర్ నేరాల డైనమిక్ సవాళ్లను ఎదుర్కోవడం సమాజం ముందున్న ప్రధాన కర్తవ్యమని, వీటిని ఎదుర్కోవడంలో అందరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

జైలు అధికారులే కీలకం

ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో జైలు అధికారుల పాత్ర కీలకమని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్-2025 ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. డ్యూటీ మీట్‌లో పలు విభాగాల్లో తెలంగాణ జైళ్ల శాఖ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మొదటిస్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయా విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆయన మెడల్స్, ట్రోఫీలు అందించారు. తెలంగాణ జైళ్ల శాఖ సొంతం చేసుకున్న ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా అందుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ విధానాల్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలన్నారు. తెలంగాణలో జాతీయ ప్రిజన్ అకాడమీ ఏర్పాటుకు సహకరించాలని బండి సంజయ్‌ను సౌమ్యా మిశ్రా కోరారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక జైళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని బీపీఆర్‌డీ అదనపు డీజీ రవి జోసెఫ్ లోకూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్, జాతీయ పోలీస్ శిక్షణా కేంద్రం డైరెక్టర్ అమిత్ గార్గ్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జైళ్ల శాఖ ప్రతిభ

7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్‌లో అత్యధిక ట్రోఫీలు, మెడల్స్ సాధించి తెలంగాణ జైళ్ల శాఖ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 28 పతకాల్లో బంగారం-21, వెండి-4, కాంస్యం-3 ఉన్నాయి.

2017లోనే చిరునామా మార్పుకు ఫామ్-6 సమర్పణ: కోట నీలిమ

తనకు రెండు ఓటరు గుర్తింపు కార్డులు ఉన్నాయని స్వతంత్ర సంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నోటీసు ఇవ్వడమేమిటని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ ప్రశ్నించారు. ఓటరు గుర్తింపు కార్డులో తన చిరునామాను మార్చాలని కోరుతూ ఎన్నికల సంఘానికి 2017లోనే ఫామ్-6 ఇచ్చామని, దానికి ఈసీ అక్‌నాలెడ్జ్ కూడా ఇచ్చిందని గురువారం గాంధీభవన్‌లో మీడియాకు చెప్పారు. ఫామ్-6 సమర్పించిన తర్వాత కూడా తన చిరునామా మార్చని ఈసీ, రెండు ఓటరు గుర్తింపుకార్డులున్నట్లు నోటీసులివ్వడమేమిటన్నారు.

గ్రూప్-1 పరీక్ష మళ్లీ నిర్వహించాల్సిందే

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు.. సీఎం రేవంత్ రెడ్డి రాజీనామాకు డిమాండ్

» ఓయూ సహా పలుచోట్ల బీఆర్ఎస్‌వీ ఆందోళనలు, పలువురి అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ, చిక్కడపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పు నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిందేనని బీఆర్ఎస్‌వీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయం, హైదరాబాద్, చిక్కడపల్లిలోని కేంద్ర గ్రంథాలయం వద్ద వారు గురువారం ఆందోళనకు దిగారు. ఇందులో భాగంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ముఖ్యమంత్రి ఫొటోలను చింపేశారు. గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో టీజీపీఎస్సీ విఫలమైనందుకు నైతిక బాధ్యతగా సీఎం రేవంత్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న పలువురు బీఆర్ఎస్‌వీ నేతలను పోలీసులు అరెస్టు చేసి వేర్వేరు పోలీసుస్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు మాట్లాడుతూ గ్రూప్-1 అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. గ్రూప్ 1 పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని లేని పక్షంలో తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకోవడంతో అభ్యర్థులు నిరుత్సాహానికి లోనవడంతో పాటు మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 29 ద్వారా చేపట్టిన నియామకాల వల్ల రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందని నిరసనలు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం లాఠీ చార్జీలు చేస్తుందని ధ్వజమెత్తారు.



బీఆర్ఎస్‌వీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మంత్రులు, సీఎంవో నుంచి గ్రూప్-1 పోస్టుల అమ్మకం : కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పోస్టుల కోసం ప్రభుత్వ పెద్దలు భారీగా డబ్బులు డిమాండ్ చేసినట్లు నిరుద్యోగులు చెబుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మంత్రులు, సీఎంవో నుంచే గ్రూప్-1 పోస్టులను కోట్ల రూపాయలకు అమ్ముకున్నారనే విమర్శలు ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం గ్రూప్ 1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే, పరీక్షల్లో జరిగిన అవకతవకలపై జ్యూడిషియల్ కమిషన్‌తో విచారణ చేపట్టి ఉద్యోగాలు అమ్ముకున్న దొంగలెవరో తేల్చాలని కోరారు. పరీక్షల నిర్వహణలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని యువత ఎప్పటికీ క్షమించదని కేటీఆర్ పేర్కొన్నారు. ఏడాది లోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానంపై ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి చర్చించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక, బీఆర్ఎస్‌వీ నాయకుల అరెస్టును బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఖండించారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను రెచ్చగొట్టిన రేవంత్‌రెడ్డి తన అసమర్థతను ఒప్పుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 అవకతవకలపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు.

సిమ్ బాక్స్ ముఠా అరెస్టు

» అంతర్జాతీయ కాల్స్‌ను.. లోకల్ కాల్స్‌గా మారుస్తున్న ముఠా

» హాంగ్‌కాంగ్‌లో సూత్రధారి వెన్నీసా..

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే అంతర్జాతీయ ఫోన్‌కాల్స్‌ను రిసీవ్ చేసుకోవద్దని, మోసగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని కేంద్ర,రాష్ట్ర సంస్థలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు తమ పంథాను మార్చారు. అంతర్జాతీయ కాల్స్‌ను స్థానిక కాల్స్‌గా మార్చే సాంకేతికతను వాడుతూ సిమ్ బాక్స్ డంపింగ్ ద్వారా ఎర వేయడానికి సన్నద్ధమయ్యారు. హాంగ్‌కాంగ్‌లో ఉన్న సైబర్ నేరగాళ్ల ముఠాలోని సూత్రధారి వెన్నీసా అనే మహిళ ద్వారా హైదరాబాద్, చాంద్రాయణగుట్టలలో సిమ్ బాక్స్ ఏర్పాటు చేసిన హిదయతుల్లా, అతనికి వందలాది సిమ్ కార్డులు ఇచ్చిన మరో ఇద్దర్ని సైబర్ సెక్యూరిటీ, కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖాధికారులు సంయుక్త ఆపరేషన్‌లో పట్టుకున్నారు. కార్ల వ్యాపారం చేసే హిదయతుల్లా అందులో నష్టం రావడంతో స్నాప్‌చాట్ ద్వారా పరిచయమైన ఒక వ్యక్తిని సంప్రదించాడు. అతనిచ్చిన సలహా మేరకు ఒక ట్రేడింగ్ యాప్‌లో రూ.16లక్షలు పెట్టుబడి పెట్టి మళ్లీ నష్టపోయాడు. దీంతో సదరు ఆగంతకుడు హిదయతుల్లాకు వాట్సాప్ ద్వారా హాంగ్‌కాంగ్‌లో ఉన్న వెన్నీసా అనే మహిళను పరిచయం చేశాడు. తమకు సాయం చేస్తే డబ్బు వచ్చేలా చేస్తామని వెన్నీసా పేర్కొనడంతో హిదయతుల్లా ఒప్పుకున్నాడు. ఒక సిమ్ బాక్స్‌ను పంపిస్తామని, స్థానికంగా సిమ్ కార్డులు సేకరించి, వైఫై కనెక్షన్ తీసుకుని దాని ఆపరేషన్ తమకు అప్పగించాలని వెన్నీసా సూచించడంతో హిదయతుల్లా సరే నన్నాడు. అతడికి కొరియర్ డెలివరీ బాయ్ ద్వారా అతనికి సిమ్ బాక్స్ అందింది. సిమ్‌కార్డుల కోసం వివిధ టెలికం కంపెనీల్లో పనిచేస్తున్న అహ్మద్‌ఖాన్, షోయబ్‌లను హిదయతుల్లా సంప్రదించాడు, వారు అందించిన 500 సిమ్ కార్డుల్లో 200 కార్డులను సిమ్ బాక్స్‌లో వేసి దాన్ని వెన్నీసా సూచించినట్లు హిదయతుల్లా పని చేయడం ప్రారంభించాడు. సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి అందిన ఫిర్యాదు ఆధారంగా రంగంలో దిగిన పోలీసు బృందాలు చాంద్రాయణగుట్ట నుంచి విదేశీ కాల్స్ రూట్ అవుతున్నట్లు గుర్తించి హిదయతుల్లాతో పాటు సిమ్‌లు అందచేసినవారిని పట్టుకున్నారు. వెన్నీసా గురించి దర్యాప్తు జరుపుతున్నామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అదనపు డైరెక్టర్ అనురాగ్ తెలిపారు.

గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డా. వాణి నియామకం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అదనపు వైద్య విద్య సంచాలకులుగా ఉన్న ఆమే, గతంలో మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు. శుక్రవారం సూపరింటెండెంట్‌గా బాధ్యతలను స్వీకరించనున్నారు. కాగా, గత సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిపై ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయి. ఆమె బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆసుపత్రి పాలన గందరగోళంగా మారిందన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో రాజకుమారిపై సర్కారు వేటు వేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు గాంధీ మెడికల్ కాలేజీలోనే ఫిజియాలజీ ప్రొఫెసర్‌గా కొనసాగుతారని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గొర్రెల స్కాం కేసులో ఈడీ దూకుడు


బాధితులను విచారించేందుకు నోటీసులు జారీ

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల కొనుగోలు, బిల్లుల చెల్లింపు గోల్‌మాల్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేగం పెంచింది. గొర్రెల స్కాంకు సంబంధించి ముందుగా కొందరు బాధితులు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో నిందితులుగా ఉన్న ప్రస్తుత, మాజీ ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులను అరెస్ట్ చేసింది. ఏసీబీ కేసు ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ విచారణ కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ కేసులో బాధితులుగా ఉన్న వారిని విచారించి వాంగ్మూలం నమోదు చేసేందుకు ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు సిద్ధమయ్యారు. ఏసీబీ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా బాధితులకు నోటీసులు జారీ చేసి ఈ నెల 15న విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. మొదటి దశలో బాధితులను విచారించిన అనంతరం రెండో దశలో ఈ కేసులో ఏసీబీ అరెస్ట్ చేసిన వారికి సైతం నోటీసులు జారీ చేసి ప్రశ్నించేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారు.

వ్యవస్థాగత లోపాలు సరిదిద్దకుండా గురుకుల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులా?

తెలంగాణ గురుకులాల ప్రిన్సిపాళ్ల సంఘం ఖండన

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవస్థాగత లోపాలు సరిదిద్దకుండా ప్రిన్సిపాళ్లను బాధ్యులను చేయడం సరి కాదని తెలంగాణ గురుకులాల ప్రిన్సిపాళ్ల సంఘం (టీజీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కుమార్ రౌతు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, కాలేజీల్లో పూర్తిస్థాయిలో విద్యార్థుల ప్రవేశాలు నిర్వహించలేదని, విద్యార్థులు తగ్గారంటూ రాష్ట్ర వ్యాప్తంగా 170 మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసు ఇవ్వడాన్ని ఖండించారు. ఎక్కువ గురుకుల పాఠశాలలు/ కాలేజీలు పెట్టి 100 శాతం ప్రవేశాలు చేయాలని కోరడం సబబు కాదని పేర్కొన్నారు.





తాళాలు పగులగొట్టి చోరీ

● నగదు, బంగారం అపహరణ

రామాయంపేట/సంగారెడ్డి క్రైం,/నర్సాపూర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పలు చోట్ల బుధవారం ఇంటి తాళాలు పగులగొట్టి విలువైన వస్తువులు, డబ్బు, బంగారం, వెండి దొంగలించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నారాయణపూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లల్లో ఒకే సమయంలో చోరీ జరిగింది. . ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపూర్ గ్రామానికి చెందిన ఎడ్లపోచయ్య ఈ మధ్యనే కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. పాత ఇంట్లో బీరువాతో పాటు బియ్యం సంచులు ఉండగా కొత్త ఇంట్లో పడుకోవడానికి కుటుంబీకులు అంతా వెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి వెళ్లి చూడగా తాళం పగులగట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న పదివేల నగదుతో పాటు 8 తులాల వెండి బిళ్లలు కనిపించలేదని ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఇదే ఇంటి సమీపంలో ఉన్న రొట్టంప్రభాకర్ ఇంటి తాళం కూడా పగులగొట్టి ఇంట్లోని గ్యాస్ సిలిండర్ ఎత్తుకెళ్లారు. నీరుడి స్వరూప ఇంటి తాళం పగుగొట్టి అల్మారాలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు నగలు, 20తులాల వెండి నగలు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలోని పిచ్చకుంట్లనర్సింలు, నీరుడి బాలమణి, పిచ్చకుంట్లకుమార్ ఇంటి తాళాలు కూడా పగులగొట్టి దొంగతనానికి ప్రయత్నించి అందులో నుంచి ఏమీ పోలేదని ఎస్సై తెలిపారు.



నారాయణపూర్‌లో దొంగతనం జరిగిన ఇంటి వద్ద విచారిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్ తదితరులు

రామాయంపేటలో..

రామాయంపేటలో బుధవారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంటి టార్గెట్ చేసి బీరువాలు దాచిన మూడు తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన బిర్రు నరసప్ప ఇంటి తాళం పగులగొట్టి బీరువా ధ్వంసం చేశారు. దాంట్లోని మూడు తులాల నగలు, కొంత నగదును దోచుకెళ్లారు. ముసుగు ధరించిన నలుగురు దొంగలు ఇక్కడి నుంచి వెళ్లి కే ఎన్ ఆర్ కాలనీలో బయట పార్క్ చేసిన బైక్‌ని ఎత్తుకెళ్లారు.

కారు డ్రాప్ బాక్సులో నుంచి..

సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల ఏవన్ రెడ్డి కిరాణ దుకాణం యజమాని నర్సింహ్మారెడ్డి గురువారం మధ్యాహ్నం రూ.54వేల రూపాయల కవర్‌ను తన కారు డ్రాప్ బాక్సులో ఉంచి దుకాణం పక్కన పార్కు చేశాడు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులగొట్టి డబ్బు ఎత్తుకెళ్తున్న క్రమంలో కొందరు అరుపులు వేయగా దొంగలు డబ్బుల కవర్‌ను తీసుకొని పారిపోయారు. ఈ విషయమై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు నర్సింహ్మారెడ్డి తెలిపారు.

ప్రియుడిపై మోజుతో భర్తపై హత్యాయత్నం

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో కలిసి భర్తను హత మార్చాలని పథకం పన్ని చివరకు ఇద్దరు కటకటాల పాలయ్యారు. గురువారం జగదేవ్‌పూర్ ఎస్సై కృష్ణారెడ్డి ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన తిగుళ్ల బాలచంద్రం భార్య మమతతో అదే గ్రామానికి చెందిన వడ్డె బాబుకి ఏడాదిగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. ఇది బాలచంద్రానికి తెలియడంతో మమత సోదరులైన మహేష్, లక్ష్మణులకు తెలుపగా వడ్డె బాబు, మమతను రెండుసార్లు మందలించారు. దీంతో ఇరువురు కలుసుకోవడం కష్టంగా మారింది. బాలచంద్రాన్ని చంపితేనే తాము స్వేచ్ఛగా తిరగవచ్చని భావించిన వారిద్దరు ఆగస్టు 24న హత్యకు పథకం వేశారు. ఆ రోజు రాత్రి బాలచంద్రం పడుకున్న తర్వాత మమత వడ్డె బాబుకి ఫోన్ చేసి పిలిపించి ఐరన్ రాడ్, కూరగాయలు కోసే కత్తితో దాడిచేయగా బాలచంద్రం అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో బాలచంద్రం మృతి చెందాడు అనుకొని బాబు అక్కడినుంచి పారిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న జగదేవ్‌పూర్ పోలీసులు విచారణ చేపట్టి బాబు నిందితుడిగా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా బాలచంద్రం భార్య కుట్ర వెలుగులోకి వచ్చింది. మమతనే తన భర్తను చంపమని ప్రోత్సహించిందని పోలీసుల విచారణలో బాబు తెలిపాడు. ఈ మేరకు మమత, బాబును అదుపులోకి తీసుకుని జ్యూడిషియల్ రిమాండ్ నిమిత్తం గజ్వేల్ కోర్టులో హాజరుపరిచారు.

పిల్లలు పుట్టలేదని భర్తకు వీడియో కాల్ చేసి..

మేడ్చల్ టౌన్/రామాయంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వివాహం జరిగి మూడేళ్లయినా పిల్లలు పుట్టలేదని మనస్తాపంతో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన గురువారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం తిప్పలగూడకు చెందిన దంపతులు వినయ్, రవళి(24)లకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఉపాధి నిమిత్తం మేడ్చల్ పట్టణంలోని కింది బస్తీకి కొన్ని నెలలు క్రితం వచ్చారు. ఏళ్లు గడుస్తున్నప్పటికీ పిల్లలు పుట్టక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రవళి గురువారం బయటికి వెళ్లిన భర్తకు వీడియో కాల్ చేసి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. షాక్‌కు గురైన భర్త తాను పనిచేసే కంపెనీలోనే కుప్పకూలి కోమాలోకి వెళ్లాడు. తోటి సిబ్బంది వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

అమ్మవారి సన్నిధిలో శవమై ..

పాపన్నపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మంజీరా వరదల్లో కొట్టుకుపోయి వ్యక్తి శవమై కనిపించిన సంఘటన ఏడుపాయల వద్ద గురువారం చోటు చేసుకుంది. ఏఎస్సై దేవీదాస్ కథనం ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన దొంతుల సంతోష్ కుమార్ (42) వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 6న ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. . గురువారం ఆలయ సమీపంలో నదీపాయ వద్ద నీటిలో కొట్టుకువచ్చి పొదల్లో తట్టుకుని కుళ్లిన స్థితిలో ఉన్న ఓ వ్యక్తి మృతదేహం స్థానికులకు కనిపించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబీకుల ఆనవాళ్లను బట్టి మృతి చెందింది సంతోష్ కుమార్‌గా గుర్తించారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తన తమ్ముడి మృతిపై అనుమానం ఉందని మృతుడి అన్న అశ్వినికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మనోహరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఒలికె ఆంజనేయులు (31) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం రాత్రి ఆంజనేయులు ముప్పిరెడ్డిపల్లి గ్రామం నుంచి బైక్‌పై కాళ్లకల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ శివారులో అతివేగంతో ఎదురుగా వస్తున్న స్కూటీ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ఆంజనేయులు కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. మరొక బైక్‌పై ఉన్న అదే గ్రామానికి చెందిన జాజుల మహేందర్, అతడి తల్లి జాజుల బాలమణి కింద పడ్డారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆంజనేయులును గాంధీ ఆసుపత్రికి, మిగతా వారిని మేడ్చేల్‌లో మెడినోవా ఆసుపత్రికి తరలించారు. ఒలికె ఆంజనేయులు చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయాడు. ఆంజనేయులు అన్న ఒలికె లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ..

చిన్నకోడూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై సైఫ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం .. ఆగస్టు 21న మండలంలోని రామంచగ్రామ శివారులో మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి (60) పడి ఉన్నాడు. గమనించిన గ్రామస్థులు 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రామంచ గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖరానందచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం

పటాన్‌చెరు సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు చిన్నారులతో తల్లి అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీఆర్ వెంచర్‌లో ఉంటున్న మితున్‌కుమార్‌శర్మ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీన ఉదయం బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి భార్యఆశకుమారి, కుమారుడు రితిక్‌కుమార్, యాష్‌కుమార్, కుమార్తె కుషికుమారి కనిపించలేదు. ఇంటికి తాళం వేసి ఉంది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో విచారించినా ఫలితం లేదు. మితున్‌కుమార్‌శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



నిమ్జ్ భూములను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి

నిమ్జ్ భూములను పరిశీలించిన కలెక్టర్

ఝరాసంగం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పరిధిలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాలో నిమ్జ్ ప్రాంతాన్ని గురువారం టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. భూసేకరణ, పలు అంశాలను చర్చించారు. ప్రాజెక్టు కింద సేకరించిన భూములకు కంచె ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూవివాదాల కేసులను పరిష్కరించి పరిహారం చెల్లించాలన్నారు. కంపెనీలకు ఇప్పటికే కేటాయించిన భూముల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వీరి వెంట అదనపు కలెక్టర్ మాధురి, టీజీఐఐసీ జోనల్ మేనేజరు తదితరులు ఉన్నారు.

కృష్ణ జింక కొమ్ములు విక్రయించే యత్నం

● నిందితుడిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా కృష్ణ జింక కొమ్ములు విక్రయించే యత్నం చేస్తున్న వ్యక్తిని ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి, కృష్ణ జింక కొమ్ములు స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన మహ్మద్ కలీముద్దీన్ అలియాస్ సలీం (54) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అంతేకాకుండా స్థానికంగా దుకాణం నిర్వహిస్తున్నాడు. వస్తున్న ఆదాయం కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో తరచూ నగరానికి వచ్చి మేస్త్రీ పనులు చేసేవాడు. కృష్ణ జింక కొమ్ములు విక్రయిస్తే మంచి లాభాలు గడించవచ్చని తెలుసుకున్న ఇతడు, అటవీ ప్రాంతం నుంచి రెండు కృష్ణ జింక కొమ్ములు సంపాదించాడు. ముందుగా కొమ్ములను చిన్న ముక్కలుగా కోసి... వాటిని పొడిగా మార్చి కీళ్ల నొప్పులకు మందు పేరుతో విక్రయించాడు. లాభాలు రాకపోవడంతో రెండు కొమ్ములను టోకుగా విక్రయించాలని నగరానికి వచ్చాడు. చాంద్రాయణగుట్ట అబ్బాస్ గ్రౌండ్ వద్ద అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్న ఇతడిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అతడి వద్ద జింక కొమ్ములు ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. అతడిపై వైల్డ్‌లైఫ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు.

మేకల కాపరిపై అటవీ జంతువు దాడి

చేగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మేకల కాపరిపై అటవీ జంతువు దాడి చేసిన సంఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం కన్యారం గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. బాధితుని కథనం ప్రకారం.. కన్యారం గ్రామానికి చెందిన పట్నం రాజు రోజులాగే గురువారం అటవీ ప్రాంత సమీపంలో మేకలను తీసుకొని వెళ్లాడు. సాయంత్రం సమయంలో అటవీ జంతువు మేకల మందపై దాడిచేయగా, దగ్గరున్న ఆయుధంతో దాడి చేయడంతో పారిపోయింది. కొద్దిసేపటి తర్వాత మళ్లీ దాడి చేసేందుకు వచ్చి, మీద దూకడంతో రాజు కింద పడిపోయి కేకలు వేయగా, చుట్టుపక్కల వారి అరుపులతో పారిపోయింది. రాజుకు స్వల్ప గాయాలు కాగా, చేగుంట ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. రాజు చిరుత పులి దాడి చేసిందని చెబుతుండగా, గాయాలను బట్టి ఏదైనా అటవీ జంతువు దాడి చేసి ఉండవచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.







భళా.. చిత్రకళ

● ముగిసిన స్పార్క్ ఫెస్ట్ పోటీలు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మైనారిటీ సంక్షేమ పాఠశాల, జూనియర్ కాలేజీల్లో స్పార్క్ ఫెస్ట్ పోటీలు ఘనంగా ముగిశాయి. సృజనాత్మక పోటీల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక ఆర్ట్ పోటీల్లో విద్యార్థుల చిత్రకళ అందరినీ ఆకట్టుకున్నది. సిద్దిపేటలోని మైనార్టీ సంక్షేమ బాలుర, బాలికల పాఠశాలల్లో వేర్వేరుగా మూడు రోజుల పాటు జరిగిన స్పార్క్ ఫెస్ట్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపన్యాస, వ్యాసరచన, డిబేట్, క్విజ్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ పరకాల శ్రీనివాస్, బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ వి.శ్రీవాణి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు వివిధ సాంస్కృతిక, విజ్ఞాన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.











శిథిలావస్థకు చేరిన రామాయంపేట ఎస్సీ బాలికల వసతి గృహం, నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది ఎస్సీ గురుకులంలో తరగతి గదిలోనే విద్యార్థుల వసతి ఏర్పాట్లు

గురు'కూలు' భవనాలు

(3వ పేజీ తరువాయి) మూత్రశాలలు పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

● చిన్నశంకరంపేటలోని ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థలో వెక్కిరిస్తోంది. 60 మంది విద్యార్థులు ఉన్నారు. వర్షం పడితే నీళ్లు ఉరుస్తున్నాయి. పలు గదుల్లో పైకప్పు పెచ్చులూడుతోంది.

● కంగ్టిలోని ఎస్సీ బాలుర గురుకుల విద్యాలయంలో 484 మంది విద్యార్థులు ఉన్నారు. ఇది నూతన భవనమే అయినప్పటికీ పాటవాల చుట్టుపక్కల అపరిశుభ్రత నెలకొంది. పిచ్చిమొక్కలు పెరిగి విషకీటకాలతో ముప్పు పొంచి ఉంది.

● కల్హేర్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరి నీళ్లు కారుతున్నాయి.

● చేగుంట ఎస్సీ హాస్టల్లో 94 మంది విద్యార్థులు ఉండగా వారందరికీ కేవలం మూడు గదులే ఉన్నాయి. గతంలో ఉన్న పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని కిచెన్ షెడ్డుగా, ఆఫీస్ రూము, స్టాక్ రూముగా వాడుతున్నారు. ఆ భవనంపైన గోడలు బీటలు వారాయి. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

● నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయి. పిల్లలకు వసతి కల్పిస్తున్న గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. పది మంది విద్యార్థులకు స్వల్పంగా జ్వరం ఉంది.

● సంగారెడ్డి మండలం కోత్లాపూర్ గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాల అద్దె భవనంలో ఉంది. వంటగది అపరిశుభ్ర వాతావరణంలో కనిపించింది. కోతులు, విషకీటకాల ప్రమాదం పొంది ఉంది. విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి.

● హవేళిఘణపూర్ గురుకుల పాఠశాలను వైపీఆర్ ఇంజనీరింగ్ కలాశాలలో నిర్వహిస్తున్నారు. వర్షం కురిస్తే ఈ ప్రాంతమంతా చెరువును తలపిస్తోంది. దోమలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

● హుస్నాబాద్ పట్టణ శివారులో నిర్మించిన గిరిజన బాలికల మేనేజ్మెంట్ హాస్టల్‌లో 20 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ భవనానికి ప్రహరీ లేక విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయింది.

నర్సాపూర్‌లో నత్తనడకన గిరిజన గురుకులం మరమ్మతులు

● ఏడాది గడిచినా పూర్తికాని పనులు

నర్సాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ప్రత్యేకత కలిగిన నర్సాపూర్ అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో, ఏడాది క్రితం గత ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. అయితే, పనులు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 40 శాతం కూడా పూర్తి కాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సకాలంలో బిల్లులు రాకపోవడం వల్లే కాంట్రాక్టర్లు పనులు నెమ్మదిగా చేస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం పాఠశాల భవనం స్లాబ్ ఫ్లోరింగ్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. పాత కిటికీలు, తలుపులు దెబ్బతినడంతో వాటి స్థానంలో కొత్తవి బిగించే పనులు కూడా పూర్తి కాలేదు. విద్యుదీకరణ, రంగుల పనులు కూడా మొదలుపెట్టలేదు. ఈ పనులు త్వరగా పూర్తయితేనే విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు తొలగిపోతాయి. మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేసి పూర్వవైభవం తీసుకురావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



పెచ్చులూడిన పైకప్పు



నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల భవనం

కొనసాగుతున్న గురుకుల హాస్టల్ కూల్చివేత

మునిపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల హాస్టల్ మూడు రోజుల క్రితం కుప్పకూలిన విషయం తెలిసిందే. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేస్తున్నారు. మూడు రోజుల నుంచి జిల్లా, మండలస్థాయి అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. కూలిన భవనంలో ఉన్న విద్యార్థులు కూర్చొనే బెంచీలను స్టోర్‌రూమ్‌లో భద్రపర్చారు. తాత్కాలికంగా షెడ్లను ఏర్పాటు చేసే వరకు విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఈ విషయంపై ఎప్పటికప్పుడు సంబంధిత శాఖ అధికారులను మంత్రి అడిగి తెలుసుకుంటున్నారు.



లింగంపల్లి గురుకుల హాస్టల్ భవనాన్ని కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతికి ప్రయోజనం

● ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలు దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు, చిన్న వ్యాపారులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ దిశగా భారత్ వేగంగా పయనిస్తోందని, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడం ద్వారా ఈ లక్ష్యం సులభంగా నెరవేరుతుందని ఆయన తెలిపారు. గురువారం మెదక్ పట్టణంలోని వ్యాపారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ తమ దుకాణాల బయట స్వదేశీ వస్తువులు విక్రయిస్తాం అని బోర్డులు పెట్టాలని కోరారు. ప్లాస్టిక్ కాలుష్యంపై దృష్టి సారించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా పేపర్, వస్త్ర సంచులను వాడాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబరు 17న ఇంటింటా మొక్కలు నాటాలని ప్రజలను కోరారు. ఆ రోజు మోదీ పుట్టినరోజు, విశ్వకర్మ జయంతి, తెలంగాణ విమోచన దినోత్సవం... ఈ మూడు పండుగలను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



పాపన్నపేట మండలం కొత్తపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు, పక్కన నాయకులు

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

పాపన్నపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలంటే ప్రజల మనసులను గెలుచుకోవాలని ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. మండలంలోని కొత్తపల్లిలో జరిగిన సేవా పక్షం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చోటు సంపాదించిన వాళ్లే నిజమైన నాయకులన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో తన ప్రత్యర్థులు కోట్లు ఖర్చు చేసినా ఓడిపోయారని ఆయన గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, ఇది ప్రపంచానికి గర్వకారణమని పేర్కొన్నారు. సేవా పక్షం పేరుతో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు సేవా కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు కేంద్ర పథకాలను వివరించాలని కార్యకర్తలకు సూచించారు. గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు కోల్పోయిన కొడిపల్లి మండల పరిధిలోని ముట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన బాధితులను ఎంపీ రఘునందన్‌రావు పరామర్శించారు.



చేర్యాలలో రాస్తారోకో

యూరియా యాతన

అవే బాధలు.. రైతులకు తప్పని వెతలు.. దుబ్బాకలో సొమ్మసిల్లిన మహిళ

దుబ్బాక/దౌల్తాబాద్/చేర్యాల/హుస్నాబాద్/అల్లాదుర్గం/నిజాంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా దొరకక యాతన తప్పడం లేదు. రోజులాగే గురువారం కూడా రైతులకు తిప్పలు తప్పలేవు. ఆయా ప్రాంతాల్లో పీఏసీఎస్, ఆగ్రో సేవా కేంద్రం, ఫర్టిలైజర్ దుకాణాల వద్ద యూరియా బస్తాల కోసం రైతులు బారులు తీరారు. సిద్దిపేట జిల్లాలోని దుబ్బాకలో ఆకుల దేవయ్య ఫర్టిలైజర్ దుకాణం వద్ద ఓ మహిళ సొమ్మసొల్లి పడిపోయింది. గంబీర్‌పూర్ గ్రామానికి చెందిన రెడ్డి చిత్తవ్వ యూరియా కోసం బుధవారం అర్ధరాత్రి నుంచి నిరీక్షించింది. రాత్రి నుంచి నిద్ర లేకపోవడంతో అస్వస్థతకు గురై గురువారం ఉదయం సొమ్మసొల్లిపడిపోయింది. ఆమెను వెంటనే 108 అంబులెన్స్‌లో దుబ్బాక ఆస్పత్రికి తరలించారు. దుబ్బాకలోని రెండు ఫర్టిలైజర్ దుకాణాల వద్ద గురువారం దాదాపు 3,000 మంది రైతులు బారులు తీరారు. అందులో చాలా మంది ముందు రోజు రాత్రి నుంచే పడిగాపులు కాశారు. తీరా వెయ్యి మందికి కూడా యూరియా దొరకలేదు. బారులు తీరి టోకెన్లను తీసుకున్నాక యూరియా బస్తాల కోసం మళ్లీ అవస్థలు తప్పడం లేదని, ఒక్క బస్తానే పంపిణీ చేస్తున్నారని మండిపడిన రైతులు చేర్యాలలో బాలాజీకళామందిర్ చౌరస్తా వద్ద జనగామ-సిద్దిపేట జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. హుస్నాబాద్ సహకార సంఘం కేంద్రంలో గురువారం జోరు వర్షంలోనూ రైతులకు యూరియా తిప్పలు తప్పలేవు. రాత్రి వరకు నిరీక్షించి ఎరువును తీసుకెళ్లారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని కాట్రియాల గ్రామంలో రైతులు యూరియా కోసం ఎగబడగా, పోలీసుల పహారా మధ్య పంపిణీ చేశారు. నిజాంపేట మండల కేంద్రంలో రైతులు వర్షంలో సైతం గొడుగులు పట్టుకుని లైన్‌లో వేచిఉన్నారు. అల్లాదుర్గంలోని ఓ ఫర్టిలైజరు దుకాణానికి లారీలో 40 మెట్రిక్ టన్నులు(900 బస్తాల) లోడ్ వచ్చింది. రైతులు దుకాణంలో దించకుండానే ద్విచక్రవాహనాలు, ఆటలలో తీసుకెళ్లి గంట సమయంలోనే ఖాళీ చేశారు.



దుబ్బాకలో యూరియా కోసం వచ్చి సొమ్మసిల్లి పడిపోయిన మహిళ



మనస్తాపం చెంది.. పంటను కలియదున్ని

దౌల్తాబాద్ మండలంలోని ఇందుప్రియల్ గ్రామానికి చెందిన గజ్వేల్ ముత్యాలు వారం రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నాడు. సొసైటీ, ఆగ్రోస్, ఇతర దుకాణాల వద్ద వేచిఉన్న ఒక్క బస్తా దొరకలేదు. మనస్తాపానికి గురై తాను రెండు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను కలియదున్నేశాడు.

మల్లన్న ఆలయాభివృద్ధి పనుల్లో జాప్యం

● కొన్ని నెలలుగా మారుతున్న ఈవోలు
● కొత్త ఈవో దృష్టి సారిస్తేనే పనుల్లో వేగం

కొమురవెల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కొన్ని నెలలుగా నలుగురు కార్యనిర్వహణాధికారులు (ఈవోలు) మారడంతో పనుల్లో జాప్యం నెలకొన్నది. మరో మూడు నెలల్లో మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పూర్తికావడం కష్టంగా మారింది.

జాతర నాటికి పూర్తయ్యేనా?

ఆలయంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన క్యూకాంప్లెక్స్, బండగుట్టపై 50 గదుల సత్రం, విజయాచలగుట్టపై ఢమరుకం, త్రిశూలం వంటి నిర్మాణాలు ఏళ్లుగా సాగుతున్నాయి. దేవస్థానం కోనేరును ఆధునీకరించాల్సిన అవసరం ఉంది. ఆలయాల అభివృద్ధి, నిలిచిపోయిన పనులపై మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి సమీక్ష నిర్వహించి, వెంటనే పనులు పూర్తి చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. మల్లన్న కల్యాణంతో ప్రారంభమయ్యే జానపదుల మహాజాతర వరకు పనులు పూర్తిచేస్తే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది.



కొనసాగుతూనే క్యూ కాంప్లెక్స్ నిర్మాణం

ప్రతీ 15 రోజులకు సమీక్షిస్తా..

కొత్తగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పెండింగ్ పనులపై అధికారులతో చర్చించాను. ప్రతీ 15 రోజులకు ఒకసారి కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించి, పనుల పురోగతిని పర్యవేక్షిస్తాను. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాను. వారి ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాను. స్వామివారి కల్యాణం నాటికి అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రయత్నిస్తా.

\- టంకశాల వెంకటేష్, ఈవో

బహిరంగ ప్రకటన

ICICI Bank

నమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి వారిచే వినియోగించబడిన బంగారు ఆభరణాలపై రుణవసతి ("వసతి")గా పొందిన వారి బకాయి మొత్తములను తిరిగి చెల్లించవలసినదిగా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడినవి. తమ బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తప్పనిసరి పరిస్థితిలో సెప్టెంబర్ 22, 2025న తనఖా చేయబడిన బంగారు ఆభరణములకు మేము ఇ-వేలము నిర్వహించుచున్నాము. ముందస్తు సమాచారం లేకుండా ఖాతాను తొలగించు / ఇ-వేలము తేదీని మార్చు హక్కును ICICI బ్యాంక్ కలిగియున్నది. వేలము ఆన్‌లైన్ ద్వారా మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://gold.samil.inలో నిర్వహించబడును. సవివర నియమ నిబంధనల కొరకు దిగువ ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి. రుణగ్రహీత మరణించినచో న్యాయవారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: ఆరేపేట	
220062000939	మెరుగు రాజు
220062001807	పిట్ల అక్షయ్
శాఖ పేరు: ఆర్మూర్	
069562009731	గడ్డి రాజేష్
069562012769	గురడి రాజేశ్వర్
069562012782	గుండేటి చిన్నా రెడ్డి
శాఖ పేరు: బాచుపల్లి	
279957000103	చంద్రశేఖర్ సిరిగిరిడి
279962002384	సిడమోలు సాయి విశ్వనాథ్
279957000254	పల్లా హేమంత్ రెడ్డి
శాఖ పేరు: భైంసా	
395562003594	చకాలి రాజు
395562006257	జోగాని ప్రవీణ్
శాఖ పేరు: బోధన్	
376962007148	బిక్కిన సత్తి బాబు
శాఖ పేరు: బోయిన్‌పల్లి	
761262002834	కిరణ్‌కుమార్ అల్లోళ్ల
761262002029	మంద చిన జంగయ్య
శాఖ పేరు: చంద్రంపేట	
220162001358	సుదామల్ శ్రీకాంత్
శాఖ పేరు: చెల్పూర్	
220262000715	[illegible]
220257000013	ఇప్పల ప్రేమలత
శాఖ పేరు: గజ్వేల్	
774162000546	సయ్యద్ అఖిల్
774162001114	పెద్ద నరసింహులు
శాఖ పేరు: ఘట్కేసర్	
179362007165	దిలుకూరి బావన
శాఖ పేరు: గోదావరిఖని	
068262009560	పోతుగంటి కుమార్
శాఖ పేరు: హుస్నాబాద్	
787557000197	బొమ్మ సంపత్
శాఖ పేరు: హైదరాబాద్- బహదూర్‌పురా	
736262000617	మొహమ్మద్ నసీర్ ఉద్దీన్
శాఖ పేరు: హైదరాబాదు- డెయిరీ ఫామ్ రోడ్	
483457000016	టీ రాజశేఖరం
483457000026	టీ రాజశేఖరం
శాఖ పేరు: హైదరాబాద్- కెపిహెచ్‌బి కాలనీ	
434762000869	అంజలి కుమారి సిన్హా
శాఖ పేరు: హైదరాబాద్- మోతీ నగర్	
236662002901	అబ్దుల్ హఫీజ్
శాఖ పేరు: హైదరాబాద్- నానక్‌రామ్‌గూడ	
721262000457	పార్వతి జోగి
శాఖ పేరు: హైదరాబాద్-రాయదుర్గం	
444457000033	కొమ్మా శివలలిత
శాఖ పేరు: హైదరాబాద్- అబిడ్స్	
041062006374	రితేష్ వర్మ
041062006388	అనురాగ్ అగర్వాల్
శాఖ పేరు: హైదరాబాద్- అల్వాల్	
111757000043	సందీప్ రెడ్డి వంగ
శాఖ పేరు: హైదరాబాద్- ఫిలింనగర్	
111962002981	ఎస్.వి.ఆర్ ఎర్త్ మూవర్స్
111905002274	బి బాలనాగులు
శాఖ పేరు: హైదరాబాద్- హస్తినాపూర్	
386662002211	బండారు శ్రీకాంత్ రెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్- హయత్ నగర్	
238462001788	దదలవాడ హిమబిందు శ్రీ స్నేహ
శాఖ పేరు: హైదరాబాద్ - కూకట్‌పల్లి	
631262037336	ఎంవిపి సుధాకర్
631257002878	కొండ అశోక్ కుమార్
631262036934	గుండ్లపల్లి అఖిలాష్
శాఖ పేరు: హైదరాబాద్ - మాధాపూర్	
004062030239	ఉత్సవ్ ఉమాంగ్
004057000989	కూటూరు కోటిల్యా రెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్ - మలక్‌పేట్	
059662003005	షమ పర్వీన్
059662003003	ఓమ్‌ప్రకాష్ జైసివాల్
శాఖ పేరు: హైదరాబాద్ - నల్లకుంట	
037062008375	జావేరియా ఖాన్
శాఖ పేరు: హైదరాబాద్ - పద్మారావునగర్	
112362001984	మల్లికార్జున్ చింతల
శాఖ పేరు: హైదరాబాద్ - పంజాగుట్ట	
020262009240	ఎస్ నిఖిల్ గౌడ్
020262009244	ఎస్ నిఖిల్ గౌడ్
శాఖ పేరు: హైదరాబాద్ - సంజీవరెడ్డి నగర్	
007562021380	మంగిన శ్రీలక్ష్మీ దుర్గసాయి లత
శాఖ పేరు: హైదరాబాద్ - శేరిలింగంపల్లి	
131762003354	ఎన్ నరేష్
శాఖ పేరు: హైదరాబాద్ - తెలంగాణ ఫుడ్స్	
772162000180	అవిడి చంద్రమౌళి
శాఖ పేరు: హైదరాబాద్ - టోలిచౌక్	
112462002075	మొహమ్మద్ వసీయుద్దీన్
112462001510	గుంటుపల్లి మహేష్
శాఖ పేరు: జగిత్యాల	
280862007075	మెడపట్ల లలిత
280862009039	కొట్లేటి వైష్ణవి
శాఖ పేరు: జనగాం	
070357000107	ముష్కీరహమద్ మొహమ్మద్
శాఖ పేరు: కరీంనగర్	
043862007776	మధు సుంకి
శాఖ పేరు: కరీంనగర్ - కొతిరాంపూర్	
240062001531	దీకట్ల శ్యామ్‌సుందర్
శాఖ పేరు: కరీంనగర్ - మంకమ్మతోట	
130762003449	అబ్దుల్ జలీల్ అహ్మద్
శాఖ పేరు: కరీంనగర్ - రేకుర్తి	
596857000034	బేతి సుధాకర్ రెడ్డి
శాఖ పేరు: ఖార్కానా	
630862161221	పి కుమార్
శాఖ పేరు: కోకనవానిపల్లి	
222262001158	రాదాల కళ్యాణ్‌రెడ్డి
శాఖ పేరు: లాడునూర్	
286457000008	జోగి గణేష్
శాఖ పేరు: మాధాపూర్	
220762000746	ఐదగొట్టు శంకర్
220762001071	ఐదగొట్టు శంకర్
శాఖ పేరు: మహబూబాబాద్	
750162004029	తల్లాడ కృష్ణ మోహన్
శాఖ పేరు: మహబూబ్‌నగర్	
068962031931	చన్నారం చంద్రశేఖర్
068962032831	ఎండి సాదిక్ బేగ్
శాఖ పేరు: మణికొండ - తెలంగాణ	
322262002911	ముప్పిరిశెట్టి శివ శంకర్
శాఖ పేరు: మంథని	
771962000170	మేకల నాగార్జున
శాఖ పేరు: మెదక్	
069057000305	నాయికోటి శ్రీనివాస్
069062023505	మాసాని నవీన్
069062025111	నీహెచ్ కిష్టయ్య
069062025152	గుద్దంల మల్లేశం
శాఖ పేరు:మేడ్చల్	
279862002139	సురేష్ కుమ్మరి
శాఖ పేరు: మిర్యాలగూడ	
280662008630	బొల్లేదు సతీష్
శాఖ పేరు: మోకిలా	
236762001225	హనుమంత రావు బొర్రా
శాఖ పేరు: ముధోల్- ఆంధ్రప్రదేశ్	
204562005594	పిండి చంపత్ రావు
శాఖ పేరు: నందిగ్రామ్	
223262002603	పోచయ్య కుమ్మరి
223262002851	గొల్ల నాగులు
శాఖ పేరు: నరసంపేట	
092162032249	అనిల్ కందికొండ
092162037820	చెన్నయ్య గట్టి
శాఖ పేరు: నార్సాపూర్	
223357000108	మద్దుల శ్రీనివాస్ రెడ్డి
223362001315	చింతల నవీన్
శాఖ పేరు: నిర్మల్	
153362014463	మహ్మద్ హలీమ్ అహ్మద్
శాఖ పేరు: పెద్దపల్లి	
068362007887	బి రాజేందర్
శాఖ పేరు: రామచంద్రాపురం- మెదక్	
279562001846	మన్నె భూమేశ్వర్
శాఖ పేరు: సాలక్‌పూర్	
286562001493	చొప్పరి సత్యనారాయణ
286562001876	నందన బోయిన పద్మ
286562002099	నలగొప్పుల ప్రసంతి
శాఖ పేరు: షాద్‌నగర్	
379962005022	రమారి రాధిక
శాఖ పేరు: సిద్దిపేట	
069162021895	కొలుపుల కనకవ్వ
శాఖ పేరు: సింగపూర్	
221157000035	పెండ్యాల అఖిల్ రెడ్డి
221162001721	వర్రెల రవీందర్
శాఖ పేరు: తాండూరు	
379862008639	పి అరుణ్ కుమార్
శాఖ పేరు: వికారాబాద్	
395862001093	మాణిక్యం ఒంటెల
395862003881	ముదావత్ లక్ష్మి
శాఖ పేరు: వెనేపల్లి	
131162019140	రత్నావత్ గోపాల్
131162024447	గుజ్జల కృష్ణయ్య
శాఖ పేరు: వరంగల్- కాజీపేట రోడ్డు	
230362003892	మహ్మద్ యాకూబ్ అలీ
శాఖ పేరు: జహీరాబాద్	
083662016564	యర్రోల ఆనంద్
శాఖ పేరు: కైకలూరు- ఆంధ్రప్రదేశ్	
377457000020	పోటూరు హేమంత్
శాఖ పేరు: కర్నూలు- తిలక్ నగర్	
465362000253	ఎం మహేష్
శాఖ పేరు: మోపాల్	
103662003466	నంద్యా చేతన్
శాఖ పేరు: రాయచూర్- శక్తి నగర్	
143062001748	రమేష్ ఆర్

తేది: 12.09.2025
ప్రదేశము: హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ, వరంగల్, హనుమకొండ, జనగాం, మెదక్, సంగారెడ్డి, పెద్దపల్లి, భద్రాద్రి (కొత్తగూడెం), కరీంనగర్, జగిత్యాల, జోగులాంబ (గద్వాల్), మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నిజామాబాద్, మహబూబాబాద్, నిర్మల్, రాజన్న (సిరిసిల్ల), సిద్దిపేట, యాదాద్రి భువనగిరి

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

జాప్యం.. అందుకేనా..!

- మద్దూరులో భూ భారతి రిజిస్ట్రేషన్లలో నిర్లక్ష్యం
- పత్రాలను వద్ద పెట్టుకుని కాలయాపన చేస్తున్న అధికారులు
- ఇదంతా డబ్బుల కోసమేనని అన్నదాతల ఆరోపణ
- సమయ పాలన పాటించని సిబ్బంది
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలని వినతి


మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో సాయంత్రం 6 దాటినా రిజిస్ట్రేషన్ కోసం ఎదురుచూస్తున్న రైతులు

మద్దూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తుండటంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి రావాల్సిన అధికారులు దర్జాగా ఆలస్యంగా వస్తున్నారని ఆరోపించారు. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతుందని మండిపడుతున్నారు. గురువారం స్లాట్ బుక్ చేసుకుని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సాయంత్రం 6 గంటలకు దాటేవరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని, అందుకు అధికారుల పనితీరు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ధరణిలో అరగంటలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేదని, ప్రస్తుతం స్లాట్ బుక్ చేసుకుని వెళితే గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులున్నాయని వాపోతున్నారు.

గంటల తరబడి తహసీల్దార్ వద్దే పత్రాలు..

స్లాట్ బుక్ చేసుకున్న కాగితాలను కార్యాలయంలోని సెక్షన్‌లో ఇవ్వకుండా తహసీల్దారుకే ఇవ్వాలని సిబ్బంది సూచిస్తుండటంతో కార్యాలయ పనితీరు ఏ విధంగా కొనసాగుతుందో తెలిసిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పగించిన కాగితాలను తన వద్దే గంటల తరబడి పెట్టుకుని సాయంత్రం వరకు వేచి ఉండేలా చూస్తున్నారని ఆరోపించారు. డబ్బులు దండుకోవడం కోసమే ఇలా జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. కార్యాలయ పనితీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పలువురు రైతులు తెలిపారు. ఉన్నతాధికారులు కార్యాలయంలో జరుగుతున్న తంతుపై పర్యవేక్షణ లేకుండా పోవడంతో ఆడింది ఆట పాడింది పాటగా తయారైందన్నట్లు తెలుస్తోంది. ఇబ్బందులపై కలెక్టర్ దృష్టి సారించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


నమూనాలను తిలకిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. సునీత

ఆకట్టుకున్న గణిత ప్రదర్శన

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణితశాస్త్ర పోస్టర్ ప్రజెంటేషన్ ఆకట్టుకుంది. గురువారం జరిగిన ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. సునీత సందర్శించి విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకించి అభినందించారు. అలాగే, పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు హాజరై నమూనాలను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి డా. డి.పవన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, వివిధ విభాగ అధిపతులు, గణిత విభాగ అధ్యాపకులు ఎం. రాధిక, డా. లక్ష్మీనరసింహారెడ్డి, డా. సంగీత, డా. దీపిక, రమ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ


సామాజిక తనిఖీలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులు

కొండపాక, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై గురువారం కొండపాకలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు చేపట్టిన పనుల వివరాలు తెలిపారు. గత సంవత్సరంలో ఉపాధి హామీ కింద రూ.7,17,18,450 విలువగల పనులు చేపట్టారు. అలాగే పంచాయతీరాజ్ శాఖలో రూ.1,63,16,245, మన ఊరు మన బడి కింద రూ.2.03లక్షలతో చేపట్టిన పనుల రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, కొండపాక, కుకునూరుపల్లి మండలాల ఎంపీడీవోలు వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, అంబుడ్స్‌మెన్ ఖాజా ఆరిఫ్ అలీ, విజిలెన్స్ అధికారి గణేష్, పీఆర్‌ఏఈ తిరుపతి రెడ్డి, ఏపీవో సర్వర్ పాషా, రెండు మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సోషల్ ఆడిట్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాప్రదర్శన


పాటలతో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కొమురవెల్లి,సెప్టెంబర్11(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులపై సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో గురువారం కళాప్రదర్శన నిర్వహించారు. కొమురవెల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కళాకారులు పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వేడి వేడి ఆహారాన్ని తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరి ప్రసాద్, కళాకారులు పిస్నింటి రత్నం, శ్యామ్ సుందర్, శ్రీనివాస్, తండా భిక్షపతి, రాచపల్లి శైలజ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు'


క్లినిక్‌ని సీజ్ చేస్తున్న దృశ్యం

కుకునూరుపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేటు క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఓ క్లినిక్‌ను మరోమారు సీజ్ చేశారు. పది రోజుల క్రితం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బాలుడి మృతికి కారణమైన ఆర్ఎంపీ సుదర్శన్‌పై కేసు నమోదైందని, ఆపై క్లినిక్‌ను సీజ్ చేశామని ఆయన చెప్పారు. అయినప్పటికీ, సుదర్శన్ ఈ నిబంధనలను పట్టించుకోకుండా వెనుక వైపు ఉన్న తలుపులను పగలగొట్టి రోగులకు చికిత్స అందిస్తున్నారని, ప్రభుత్వ వైద్యులు కూడా ఉపయోగించని మందులను ఇస్తున్నారని తెలిపారు. సుదర్శన్ వినియోగిస్తున్న మరో రెండు గదులను కూడా సీజ్ చేశామన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియ జేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, హుస్నాబాద్‌శాఖ వారు ఇచ్చిన ... తెలుపుతూ ... శ్రీ కొండ శ్రీనివాస్ తండ్రి : పెద్ద మల్లయ్య గారికి ... సదరు షెడ్యూల్ ఆస్తిపై ... ఏడు దినములలో ... తెలియజేయ గలరు. ...

షెడ్యూలు : ... జిల్లా సిద్దిపేట, ... హుస్నాబాద్, మండలం : హుస్నాబాద్, ... సర్వే నెం. 120 ... 213.33 ... 178.34 ... ప్లాటు నం.4

సదరు ఆస్తి యొక్క హద్దులు : తూర్పు : 30 ఫీట్ల రోడ్డు, పడమర : ... ఉత్తరం : ప్లాటు నెం. 5, దక్షిణం : ప్లాటు నెం. 1,2,3

ఇట్లు సం/- తునికి శ్రీనివాస్ రెడ్డి అడ్వకేట్
ఇ.నెం. 2-10-119, ... జ్యోతినగర్, కరీంనగర్. సెల్ : 9440070078

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, హుస్నాబాద్‌శాఖ వారు ఇచ్చిన ... తెలియజేయ గలరు. ...

షెడ్యూలు : సిద్దిపేట, సబ్-జిల్లా : హుస్నాబాద్, మండలం : హుస్నాబాద్, గ్రామం హుస్నాబాద్ లో ... సర్వే నెం. 919లో ... 146.33 ... 122.33 ... 1-1/C8 ... ప్లాట్ నం.2

సదరు ఆస్తి యొక్క హద్దులు : తూర్పు : ... రోడ్డు, పడమర : ప్లాట్ నెం.21, ఉత్తరం : ప్లాట్ నెం.1, దక్షిణం : ప్లాట్ నెం.3

ఇట్లు సం/- తునికి శ్రీనివాస్ రెడ్డి అడ్వకేట్
ఇ.నెం. 2-10-119, ... జ్యోతినగర్, కరీంనగర్. సెల్ : 9440070078

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ గజ్వేల్ డీఈ ఆర్. భానుప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో లైన్ వర్క్ కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గజ్వేల్ మండల పరిధిలోని బంగ్లా వెంకటాపూర్, ధర్మారెడ్డిపల్లి, వర్గల్ మండల పరిధిలోని మజీద్‌పల్లి, నెంటూరు, రాయపోల్ మండలంలోని బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని పేర్కొన్నారు.

'ముట్టడిని జయప్రదం చేయాలి'

చేర్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, చేయూత పెన్షనదారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న చేపట్టనున్న తహసీల్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా కో-ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి కోరారు. స్థానిక అంగడిబజార్ చౌరస్తా వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్ పెంపుపై ప్రభుత్వం తాత్సారం చేయడం తగదన్నారు. నేతలు సుతారి రమేశ్, ప్రసాద్, మాదాసు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

VINAYAKA COLLEGE OF PHYSICAL EDUCATION
(Recognised by NCTE, New Delhi & Affiliated to OU)
Thimmareddypally (V), kondapak (M), Siddipet (Dist)-502372
Cell: 9912911688

Admission Notification for 'B' Category- B.P.Ed-2025-26

Applications are invited for admissions into **B.P.Ed** (with/without **PECET** also eligible) course under **Management Quota** for the academic year 2025-26. Interested candidates may apply for admission at college admin office. Admissions will be made as per TSCHE/OU guidelines. **Last Date for application: 30-09-2025.**

Date. 10-09-2025. **Secretary**

బాధితులకు మాజీ ఎమ్మెల్సీ పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

దౌల్తాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తనకు పదవి ఉన్నా లేకున్నా దుబ్బాక నియోజకవర్గంలోని పేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని, ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. దౌల్తాబాద్ మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఇటీవల మరణించిన సీనియర్ నాయకుడు ఎంకోల బాలయ్య, అతని భార్య రాజవ్వ కుటుంబాలను ఆయన పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన జెర్ర లచ్చవ్వ, ఆమె భర్త మల్లయ్య మరణించగా, వారి కుమారుడు కిష్టయ్య కుటుంబాన్ని కూడా ఆయన ఓదార్చారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఆపదలో ఉన్న ఎవరైనా ఫోన్ చేస్తే వెంటనే వారి కుటుంబాలను పరామర్శించి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

'ఇగ్నైట్ ప్రోగ్రాం నిర్వహించడం అభినందనీయం'


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో ఇగ్నైట్ ప్రోగ్రాం నిర్వహించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ ఏ. దుర్గారెడ్డి అన్నారు. గురువారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఇగ్నైట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలు విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు సృజనాత్మకతను పెంపొందించడానికి తోడ్పడతాయన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె ప్రశంసించారు.

ఉద్యాన పంటలతోనే అధిక లాభాలు

ములుగు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తే అధిక లాభాలతో ఆర్థికంగా బలపడతారని ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులాపతి దండ రాజిరెడ్డి అన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు పంటలకు పిచికారీ చేయడానికి ఉచితంగా మందు డబ్బాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు ఉద్యాన పంటలను సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ హార్టికల్చర్ చిన్ నాయక్, లక్ష్మీనారాయణ, జిల్లా ఉద్యాన అధికారి సువర్ణ, హెచ్‌వో సౌమ్య పాల్గొన్నారు.


పాఠశాలకు సీసీ కెమెరాలు అందజేస్తున్న మహ్మద్ గఫార్

పాఠశాల అభివృద్ధిలో దాతల పాత్ర మరువలేనిది

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల పాత్ర మరువలేనిదని గజ్వేల్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసిన మహ్మద్ గఫార్ పాఠశాలకు 6 సీసీ కెమెరాలు, నెట్‌వర్క్, సౌండ్ సిస్టమ్‌ను విరాళంగా అందజేశారు. అనంతరం మహ్మద్ గఫార్‌ను పాఠశాల సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించారు.

సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులే

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి


కూటిగల్‌లో అమరవీరు స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మద్దూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి తెలిపారు. గురువారం దూళిమిట్ట మండలం కూటిగల్‌లోని స్థూపం, తూటాల మర్రి వద్ద అమరులైన వీరులకు నివాళులర్పించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో రజాకార్లు మూకుమ్మడిగా దాడి చేసి దొరికిన వారిని ఊచకోత కోశారని, 18 మందిని ఊరి బయట మర్రిచెట్టు కింద వరసగా నిలబెట్టి కాల్చి చంపారని గుర్తు చేశారు. చరిత్రను కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. కార్యక్రమంలో సత్తిరెడ్డి, ఎండీ షఫీ, అరుణ్, రమేష్, ప్రశాంత్, ఆరె సాయిలు, వెంకటయ్య, నర్సయ్య, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

యూఎస్ఎఫ్ఐ నిరసన

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని కేసీఆర్ నగర్ పరిధిలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ గదులలో ప్రభుత్వ ప్రైమరీ ఉర్దూ, హైస్కూల్‌ను నిర్వహించడం తగదని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి అన్నారు. విద్యార్థులకు సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ గదులలో పాఠశాల నిర్వహణ ఇబ్బందికరంగా ఉందని, విద్యార్థులు మరుగుదొడ్ల పక్కన కూర్చొని పాఠాలు వింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలో సంబంధిత అధికారులకు, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినా ఫలితం లేదని తెలిపారు. అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులు హేమంత్, అయాజ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య'

రాయపోల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తున్నదని, ప్రైవేటు బడుల్లో చదివించి డబ్బులు వృథా చేసుకోవద్దని తల్లిదండ్రులకు రాయపోల్ ఎంపీడీవో జమ్లా నాయక్ సూచించారు. ఆయన గురువారం ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ముతాలబ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమాలు : సీఐటీయూ

గజ్వేల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోర్డుల రద్దుకై కార్మికవర్గం పోరాటం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ మల్లికార్జున్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన రాణే బ్రేక్ లైనింగ్స్ లిమిటెడ్ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు నాలుగు లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు ఉద్యమించాల న్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, కార్య నిర్వాహక అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, స్వామి, మల్లయ్య, రాజగోపాల్ పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

అక్కన్నపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అక్కన్నపేట ఎస్ఐ ప్రశాంత్ ఈ వివరాలను వెల్లడించారు. అక్కన్నపేట మండలంలోని జనగామ క్రాస్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి ఆటోలో పారిపోవడానికి ప్రయత్నించిన నలుగురని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విచారించగా పలు దేవాలయాల్లో దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. నిందితుల్లో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన మామిడి గోపి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన జాదవ్ గణేష్, మామిడి నాగమణి, జాదవ్ శిరీష ఉన్నారు. అక్కన్నపేట మండలంలోని పెద్దమ్మ ఆలయంలో గుడిగంటలు, అమ్మవారి ముక్కుపుడక, వెండి గొలుసులు, ; గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు సీసీ కెమెరాలు, స్పోర్ట్స్‌కిట్ ఆర్టికల్స్ దొంగతనం చేశారు. వర్దన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లంద గ్రామ శివారులోని రాజరాజేశ్వరి దేవాలయంలో, ఖానాపూర్ పీఎస్ పరిధిలో ధర్మారావుపేటలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో హుండీ డబ్బులు తస్కరించారు. గోపి, గణేష్ ఇప్పటికే 25 దొంగతనాల కేసులో జైలు శిక్ష అనుభవించారు. నిందితుల వద్ద నుంచి గుడి గంటలు, బంగారు ముక్కుపుడక, వెండి పట్టీలు, రూ.4వేలు, ఆటో, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

ముగిసిన శిక్షణా తరగతులు

చేర్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని మనోచేతన స్పెషల్ స్కూల్‌లో 'డిజైనింగ్ ఎఫెక్టివ్ లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్ ఫర్ స్టూడెంట్స్ విత్ ఇంటెలెక్చువల్ అండ్ డెవలప్‌మెంటల్ డిసేబిలిటీస్' అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సమావేశానికి జిల్లా వికలాంగుల, శిశు సంక్షేమ శాఖాధికారి లక్ష్మీకాంతరెడ్డి, సీఐ ఎల్ శ్రీను తదితరులు హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రత్యేక ఉపాధ్యాయినిలకు సర్టిఫికెట్లను అందజేశారు. సీడీపీవో రమాదేవి, నిర్వాహకురాలు రమాదేవి పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రాఫిక్ డిజైన్‌పై రెండు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి భిక్షపతి మాట్లాడుతూ గ్రాఫిక్ డిజైన్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు సాంకేతిక విద్య నేర్చుకోవడానికి తమ కళాశాలలో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్ రాజిరెడ్డి, ఇందిరా నయనదేవి పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ అభివృద్ధి పనులపై నివేదిక

కొమురవెల్లి,సెప్టెంబర్11(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై ఆలయ కార్యనిర్వహణాధికారి టంకశాల వెంకటేష్ గురువారం నివేదికను విడుదల చేశారు. 100 గదుల ధర్మశాల, అమ్మవార్ల స్వర్ణ కిరీటాల తయారీ, క్యూ కాంప్లెక్స్ భవనం, 50 గదుల సత్రం, కొండపై త్రిశూలం, ఢమరుకం నిర్మాణాలపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు నివేదిక అందించి, వారి ఆదేశాల మేరకు పనులలో వేగం పెరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి


కరుణాకర్(ఫైల్)

దౌల్తాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఫిట్స్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన దొమ్మాట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..దొమ్మాట గ్రామానికి చెందిన పెద్దోళ్ల నారాయణ, యాదవ్వ దంపతుల మూడో కుమారుడు కరుణాకర్ (25) ఓ బాలుడితో కలిసి గురువారం సాయంత్రం దొమ్మాట పెద్దచెరువులో చేపల వేటకు వెళ్లాడు. కరుణాకర్‌కు ఫిట్స్ రావడంతో చెరువు వద్దనే మృతి చెందాడు. అక్కడున్న బాలుడు భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు అక్కడి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య కవిత, కూతురు ఉన్నారు.

న్యూస్ బాక్స్

డిగ్రీలో చేరడానికి మరో అవకాశం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీలో ప్రవేశం పొందడానికి దోస్త్ ద్వారా మరో అవకాశం లభించిందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జీవన్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిగ్రీలో చేరబోయే విద్యార్థులు ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే స్పాట్ అడ్మిషన్లకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. మహిళా డిగ్రీ కళాశాలలో బీఏలో 45 సీట్లు, బీకాంలో 30 సీట్లు, బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో 31 సీట్లు, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 17 సీట్లు, మొత్తం 123 సీట్లు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థినులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

గజ్వేల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో నేడు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 'గివ్ బ్లడ్- సేవ్ లైఫ్' పేరిట స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ హైమావతి, డీఎంహెచ్‌వో ధనరాజ్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

మద్దూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ అన్నారు. గురువారం దూళిమిట్ట మండలం కొండాపూర్ ఉన్నత పాఠశాలలో సీపీ ఆదేశాల మేరకు షీ టీమ్ బృందంతో కలిసి కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈవ్‌టీజింగ్, నూతన చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని, చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని హెచ్చరించారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. షీ టీమ్ విధులను కూడా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు ఏఎస్ఐ సదయ్య, కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న, కృష్ణ పాల్గొన్నారు.

రేబర్తిలో హెల్త్ క్యాంపు

మద్దూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం రేబర్తిలో సీజనల్ వ్యాధుల నివారణకు లద్నూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారితో పాటు బీపీ, షుగర్, ఒళ్లునొప్పులు, జలుబు, దగ్గు ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మహేందర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. రక్త పరీక్షలు అవసరమైన వారు పీహెచ్‌సీకి రావాలని సూచించారు. వాతావరణం దృష్ట్యా ప్రజలు పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వన్య ప్రాణుల అధ్యయనంపై విద్యార్థులకు అవగాహన

చిన్నకోడూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టడీస్ (బెంగుళూరు) ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వన్య ప్రాణుల అధ్యయనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ సెంటర్ కోఆర్డినేటర్లు తిరుపతి, శంకర్ విద్యార్థులకు వన్య ప్రాణుల సంరక్షణ, మానవ-వన్య ప్రాణుల సంఘర్షణ, వాటి ఆవాసాల సంరక్షణ, వాటిలో వచ్చే వ్యాధులు, నివారణ, వన్య ప్రాణుల చట్టాలు, విధానాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరశురాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు'

మిరుదొడ్డి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మిరుదొడ్డి ఎస్ఐ సమత హెచ్చరించారు. సిద్దిపేట సీపీ ఆదేశాల మేరకు మిరుదొడ్డిలోని వివిధ కిరాణా షాపులతోపాటు కల్లు దుకాణాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా నకిలీ మద్యాన్ని విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అంతేకాకుండా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలు కావొద్దని సూచించారు. గ్రామాల్లో జూదం ఆడేవారిపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఆమె వెంట ఏఎస్ఐ శేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.